# నీడలు

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత కా.రా. మాష్టారు ఒకరోజు 'నీడలు' కథానికని గురించి ప్రచురణ అయిన చాలాకాలం తర్వాత "చదివాను, బాగుంది" అని ఫోన్ చేశారు. వర్తమానంలో జరుగుతున్న చాలా ముఖ్యమైన సామాజికాంశాన్ని ఎన్నుకున్నానన్నారు. కానీ, ముగింపులో– "సూర్యం సవాళ్ల నుంచి పారిపోకుండా నిలబడితే బాగుండేదేమో!" అన్నారు.

\- విహారి

సూర్యం ఇంటికొచ్చేసరికి రాత్రి పదకొండు గంటలు దాటింది!

శీతాకాలపు వాతావరణం. పొగమంచు కమ్మింది. చీకటి చెట్టు ఆవులిస్తోంది. కిటికీలో నుంచి చలిగాలి వీస్తోంది.

హాల్లో కూర్చునివుంది సుజాత.

టీవీలో బొమ్మలు కదులుతున్నై. వాల్యూమ్ తక్కువలో ఉంది. సూర్యంని చూసి టీవీ ఆఫ్ చేసి లేచింది. ఆమె వంటింట్లోకి నడిచింది, అతను తన గదిలోకి వెళ్లాడు.

సూర్యం తిరిగి హాల్లో కొచ్చేసరికి డైనింగ్ టేబుల్ మీద అన్నీ అమర్చి కూర్చుంది సుజాత.

నిముషాలు మౌనంలోకి జారుతున్నై. యాంత్రికంగా నాలుగు మెతుకులు కతికారిద్దరూ. కొంతకాలంగా జరుగుతున్న రొటీనే ఇది.

సూర్యంకి మనసంతా నిస్సారంగా వుంది. భార్యవైపు చూశాడు. ప్రశ్నార్థకానికి ఆకారమొచ్చినట్లు కూర్చుని వుంది. అడగని ప్రశ్న. తొలిరోజుల్లో అడిగిన ప్రశ్న. ఆ తర్వాతర్వాత అడిగీ అడగని ప్రశ్న. ఇటీవలి కాలంలో అడగని ప్రశ్న!

ఏదో మాట్లాడదామనిపించింది. అంతలోనే 'వద్దులే... ఈ అవస్థలన్నీ ఆమెకూ ఎందుకు?' అనిపించింది. లేచి గదిలోకొచ్చాడు. క్షణాల తర్వాత హాల్లో లైట్ తీసేసి తానూ వచ్చింది.

బెడ్ మీద వాలాడు... పక్కనే కూర్చుందామె.

"ఇవ్వాళేం జరిగింది?" నెమ్మదిగా అడిగిందామె.

"మామూలే. రోజూ జరిగే భాగోతమే..." సీలింగ్ కేసి శూన్యదృక్కులు.

ఆమె మనస్సులో భయం, గుండెల్లో దడ! మాటలు కూడదీసుకుని అన్నది- "మీరీ ఉద్యోగం వదిలేయండి."

చిన్నగా నవ్వాడు. ఆమెని కమ్ముకున్న భీతిని ఆ నవ్వు ఎంతమాత్రం పలచబర్చలేదు.

"ప్లీజ్!" అన్నది ప్రాధేయపూర్వకంగా.

ఆమె అరచేతిని తన చేతుల్లోకి తీసుకుని మెత్తగా నొక్కాడు సూర్యం.

ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

సూర్యం, సుజాతల పరస్పర సాన్నిధ్యంలో మౌనప్రస్థానం చేస్తోంది- రాత్రి.

ఆ వేళ పగలు జరిగిన సంఘటనలు సూర్యం కళ్ళముందు దృశ్యమానమైనై.

కేబిన్‌లో దరఖాస్తుదారుల్ని ఇంటర్వ్యూ చేస్తున్నాడు తాను. అప్పుడొచ్చాడతను... నరసింహం- ఋణగ్రహీత! తనకు తెలుసు- లోపలికి రావటమే అరుపులతో, కేకలతో వచ్చాడు నరసింహం. విసురుగా కుర్చీ జరుపుకుని కూర్చున్నాడు.

"అసలు మీవాళ్ళని మా ఇంటి కెవడెళ్లమన్నాడో చెప్పండి? బకాయి గురించి మా ఆవిడతో పోట్లాడాల్సిన అవసరమేమొచ్చింది?"

నరసింహంతో పాటు లోపలికి వచ్చిన రికవరీ ఆఫీసర్ విశ్వం ఏదో అనబోయి ఆగాడు. అతని పక్కగా రికవరీ ఎగ్జిక్యూటివ్ మాధవరావూ నిలబడివున్నాడు.

"నరసింహంగారూ... ప్లీజ్... మీకు చాలాసార్లు ఫోన్‌లు చేశాం. మెస్సేజ్‌లు పంపించాం. ఉత్తరాలు రాశాం. నోటీసూ ఇచ్చాం. నిన్న ఆదివారం... మీరు ఇంట్లో ఉంటారు కదా అనీ..."

"ఉంటానో, ఛస్తానో మీకనవసరం. నా వైఫ్‌కి బెదిరింపు లేవిటీ?"

కేబిన్‌లో ఉన్న ఇతరులు ఉత్సుకతతో చూస్తున్నారు.

"మీ లోన్‌లో ఆమె కూడా కో అప్లికెంట్. ఆమెని అడగటం ఏదో నేరమన్నట్లు మాట్లాడతారేమండీ?" - విశ్వం.

"అవును... నేరమే! నేనసలే మంచివాణ్ణి కాదు. టాప్ లేపేస్తా...నేమను కుంటున్నారో?!" -గద్దించాడు నరసింహం. గుడ్లెఱ్ఱ చేశాడు.

"గవర్నమెంటూ, ఆర్.బి.ఐ. చెప్తున్నదేవిటీ... మీరు చేస్తున్నదేవిటీ? మరోమారిలా చేస్తే కేస్ పెట్టి బొక్కలో తోయిస్తా జాగ్రత్త!" పళ్లు కొరికాడు.

"కేస్ పెడతారా? పెట్టండి చూద్దాం. ఇంటి కోసం లోన్ తీసుకొనేటప్పుడు 'అయ్యా, బాబూ...' పద్ధతి. ఆ తర్వాత తిట్లూ, నువ్వూ, గివ్వూ అంటూ తిరగబడటం, దబాయింపూ!" – మాధవరావ్.

నరసింహం సూటిగా తనవైపు చూశాడు– "వీళ్ళంతా ఎక్కువ మాట్లాడుతున్నారు. మీరు ఇన్‌ఛార్జ్. చెప్తున్నాను... వీళ్ళను అదుపులో పెట్టుకోకపోతే నష్టపోతారు."

వాతావరణం బాగా వేడెక్కింది.

"ముందు మీ నోటికి చెప్పుకోండి!" మాధవరావ్ స్వరం పెంచే అన్నాడు. అతనికి స్థానికంగా బలమెక్కువ. అతని తండ్రి రాజకీయ నాయకుడు. అదీ అతని ధైర్యం.

మాటల పిడుగులు దుల్లుతున్నై.

మధ్యలో నరసింహం ఇంకా రెచ్చిపోయాడు.

విశ్వంని, "పంతులూ! నీ సంగతి తేలుస్తా!" అంటూ కులం పేరుతో తిట్టాడు.

"మా ఆడవాళ్ళతో మిస్‌బిహేవ్ చేశావని క్రిమినల్ కేస్‌లో బొక్కలో తోయిస్తా!" అని రక్కున లేచి విసురుగా బయటికి వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ "పనికిరాని మేనేజర్లు, పప్పుసుద్దలు!" అని తననీ అన్నాడు.

తానేదో చెప్పబోయి, సీట్లోంచి లేచి నరసింహంని అనుసరించబోయాడు గానీ, మాధవరావ్ వారించాడు– "మీరు కూర్చోండి సార్! ఇట్టాంటి వట్టిగొడ్డుల్ని చాలామందిని మనం చూస్తూనే ఉన్నాం కదా!" అంటూ.

మిగిలిన ఇంటర్వ్యూల్ని ఆపేశాడు తాను. బయటివాళ్ళంతా వెళ్లిన తర్వాత స్టాఫంతా కేబిన్‌లో కొచ్చారు. కొందరు తెలివిగానూ, కొందరు తెలివితక్కువ(!)గానూ తన సమర్థతాసమర్థతల మీద వ్యాఖ్యలు చేశారు. "ఇట్టాగైతే పనిచేయటం మావల్ల కాదు సార్. మేం రికవరీ సెక్షన్‌లో ఉండం" అని భీష్మించుకున్నారు. తానేం చేయాలో ఎవ్వరూ చెప్పరు! గుండుసూదులు గుచ్చటం మాత్రం తెలుసు!

ఆర్నెల్ల క్రితం లక్నో నుంచి వచ్చాడిక్కడికి.

పదిహేనేళ్ల సర్వీసులో ఇది తొమ్మిదో ట్రాన్స్‌ఫర్? దేశమంతా తిప్పుతూనే వున్నారు. ఒకసారి "నువ్వే ఈ బ్రాంచిని డీల్ చేయగల సమర్థుడివి" అంటారు. మరోసారి "ఫ్రాడ్ జరుగుతుంటే కళ్ళు మూసుక్కూర్చుంటే ఎట్టాగయ్యా?" అని చీవాట్లేసి పంపిస్తారు!

బెడ్ మీద మసలి తలతిప్పి పక్కకి చూశాడు సూర్యం. సుజాత కళ్ళు మూసుకుని పడుకునుంది. నిద్రపోతున్నదో, మెలకువగా ఉందో తెలీటం లేదు.

సూర్యం ఆలోచన మాత్రం సాగుతూనే వుంది...

తానీ ఉద్యోగంలో చేరినప్పట్నుంచీ సుజాతకి సుఖమూ లేదు, శాంతీ లేదు. తాను పర్సనల్ పనులకి సెలవు పెట్టడు. అన్నీ ఆమే చూసుకుంటూ ఉంటుంది. శ్రీలత, చంద్రిక, విజయ- ముగ్గురు కూతుర్ల చదువులూ, ఇతర అవసరాలూ అన్నీ- సుజాతే జాగ్రత్త వహిస్తుంది. ముగ్గురూ వచ్చీరాని వయస్సు వాళ్ళు- పదిహేను, పన్నెండు, తొమ్మిది.

మళ్లీ ఈరోజు ఆఫీసు సీనే రీవైండ్ కాసాగింది.

తాను లంచ్ చేసి కూర్చున్నాడు. హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్.

"రికవరీస్ పొజిషన్ బాగాలేదు సూర్యం. ఏం జరుగుతోందక్కడ? ఎవరో నరసింహంట. నిన్నూ, నన్నూ వాయించాడప్పుడే. కాన్ట్ యూ మేనేజ్ లోకల్ ఇష్యూస్?" కారాలూ, మిరియాలూ నూరుతున్నాడు జి.యమ్.

విషయం వివరించాలని ప్రయత్నం చేస్తుంటే వినలేదు.

"నోరుండాలయ్యా! అప్పిచ్చినవాడివి... బీ బోల్డ్!" ఇదీ సారాంశం. చివరికి, "అయామ్ నాట్ హ్యాపీ. ఇంప్రూవ్ యువర్‌సెల్ఫ్!" అని ఫోన్ కట్ చేశాడు.

మనసు చివుక్కుమంది. గుండె గీ పెట్టింది. ఆర్నెల్ల నుంచీ పడుతున్న శ్రమకి పొందిన బహుమానం ఇది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం.

దీర్ఘంగా గాలి పీల్చి వదిలాడు. కళ్ళు మూసుకుని మనసుని నిద్రవైపు మళ్లించాడు.

సుజాత భర్తవైపు తిరిగి "పొద్దుపోయింది. నిద్ర పట్టించుకోండి!" అంది.

నవ్వొచ్చింది సూర్యంకి.

అసలిదంతా ఏమిటి? ఎందుకింత బాధ, వ్యథ? ఈ నిప్పుల కుంపట్లో బతుక్కి అర్థమేమిటి? దేనికోసం ఈ సహనం? - ప్రశ్నల పరంపర! తల విదిలించుకున్నాడు.

సుజాత చెప్తున్నట్లు రేదర్ ప్రాధేయపడుతున్నట్టు- ఉద్యోగం మానేస్తే? ...సుఖంగా ఉంటుందా? దూరం, దూరం... ఎంతెంత దూరం... గుర్తుకొచ్చింది సూర్యంకి! కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

మర్నాడు ఉదయం సూర్యం ఆఫీసుకి బయల్దేరుతుంటే చీరకొంగుతో ముఖం తుడుచుకుంటూ మళ్లీ అన్నది సుజాత -

"రోజూ టెన్షన్‌గానే ఉంటోంది. మనమో నిర్ణయం తీసుకోవడం మంచిది."

"చెట్టుతొఱ్ఱలో దాక్కున్న శివుణ్ణి శని పట్టాడు విన్నావుగదా... ఆ కథలోలా భయపడి ఎక్కడికని పారిపోతాం?"

అంతకంటే ఏమీ విడమర్చలేదు సూర్యం. సుజాతా సంభాషణని పొడిగించలేదు. బెదురుచూపుతో భర్తని సాగనంపింది.

సాయంత్రం ఐదు దాటింది. పని మందగించే వేళ!

చంద్రమోహన్ వచ్చాడు. అతనొక డెవలపర్స్ కంపెనీకి లీగల్ అడ్వైజర్. ఆ కంపెనీ తీసుకున్న ఋణం చాలాకాలంగా బకాయిలో ఉంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ గురించి చర్చలు సాగుతున్నై. తెలిసిన విషయమే. వాళ్ళ ప్రపోజల్ గురించి ఇదివరకే హెడ్ ఆఫీస్‌కి ఫోన్ చేశాడు సూర్యం. ఎం.డీ. వీలుకాదని చెప్పాడు. ఇదంతా చంద్రమోహన్‌కి తెలుసు.

కూర్చున్నాడు చంద్రమోహన్. విషయంలోకి వచ్చాడు.

"మీ పైవాళ్ళు అట్లాగే అంటార్లెండి సారూ! మా బాస్‌లు ఢిల్లీ వెళ్లి మేనేజ్ చేసుకుంటారు. ఓటియస్‌కి ఒప్పుకోకపోతే అసలూ పోతుందని మీవాళ్ళకీ తెలుసు. చివరికి రైటాఫ్ చేసుకోవాల్సి వస్తుంది. అంతకుమించి ఆప్షనేం వుంది మీకు? అయినా అదంతా మీకెందుకు? మీరా ప్రపోజల్‌ని రికమెండ్ చేసి పంపెయ్యండి. కొంచెం లౌక్యం తెలుసుకోండి సారూ!" అర్థాంతరాన్నీ సౌండ్ చేసి, ఫైలు సూర్యం ముందుంచాడు.

సూర్యంకి దేహమంతా పురుగు ముట్టినట్లయింది. చిరచిరలాడింది.

అదోలా నవ్వుతూ సెలవు తీసుకున్నాడు చంద్రమోహన్.

అస్థిమితంగానే లేచాడు సూర్యం. కిటికీదాకా అడుగు లేశాడు. బయటికి చూస్తూ నిలబడ్డాడు. నాలుగో ఫ్లోర్ అది. హుసేన్‌సాగర్‌లో బుద్ధుడూ, ట్యాంక్‌బండ్ మీద వాహనాలూ కనిపిస్తున్నై. ముడిచిన రాగిపళ్ళెంలా మారి సాగర్‌లోకి దిగిపోతున్నాడు సూర్యుడు!

రోజులు భారంగా గడుస్తున్నై.

●

అర్ధరాత్రి...

హాల్లో ల్యాండ్‌లైన్ రింగయింది.

ఉలిక్కిపడి లేచాడు సూర్యం. హాల్లోకొచ్చాడు. సుజాత కూడా లేచింది. అతన్ని అనుసరించి వచ్చి లైట్ వేసింది. హాలంతా కాంతి పరుచుకుంది.

ఫోన్ తీయబోయాడు సూర్యం.

"తియ్యకండి!" సుజాత బిక్కుబిక్కుమంటున్న మనస్సు. గుండెల్లో భయం. రెండూ కలిసి ఆమె గొంతుని గద్గదికం చేసినై.

పక్కగదిలో నుంచి పిల్లలూ హాల్లో కొచ్చారు.

ఒకరి మొహాలొకరు చూసుకుంటూ కూర్చున్నారు.

"నేను చూస్తానుండండి!" అంటూ అడుగు కదిల్చింది శ్రీలత.

వద్దని ఆమెకి చేత్తో సైగచేసి తానే రిసీవరెత్తాడు సూర్యం.

గాలి బిగదీసినట్లయింది.

గొంతూ గుండే పట్టేసినట్టు దిగులు చూపులు చూస్తున్నారు సుజాతా, పిల్లలూ!

"యస్... సూర్యం..."

"..............................."

"నేనూ చెప్తూనే వున్నా. ఈ ఫోన్‌కాల్స్ వలన మీరు సాధించగలిగిందేం లేదు. ఈ బెదిరింపులు మాకేం కొత్త కాదు."

"..............................."

"రెచ్చిపోకండి. ఏం చెయ్యలేరు."

"..............................."

"ఒక్కమాట వినండి. మేమూ మీ దారిలోనే తలబడితే? ...అవును! ఆ బలం మీకొక్కళ్ళకే వుందనుకోకండి."

కోపంతో ఊగిపోయాడు సూర్యం. క్షణాల తర్వాత ఫోన్ పెట్టేస్తూ "నెలరోజుల నుంచీ ఇదే న్యూసెన్స్!" అంటూ సోఫాలో కూర్చుని వెనక్కి వాలాడు.

హాలునీ, హాల్లోని వారినీ విస్మయం లోగొన్నది!

నిముషాల తర్వాత... నిశ్చేష్టతతో నిలిచిన భార్యాపిల్లలతో అన్నాడు సూర్యం– "ఫర్వాలేదు. మీరు వెళ్ళి పడుకోండి. బుసకొట్టడం మనకీ తెలుసు."

లైట్ ఆఫ్ చేశాడు. అందరూ కదిలారు.

జరుగుతున్న కథే కళ్ళముందు కదిలింది సూర్యంకి.

మూడు నెలల ముందు మొదలైందీ గొడవ. వంద అపార్ట్‌మెంట్లు వున్న పెద్ద ప్రాజెక్ట్. రెండేళ్ల నుంచీ ప్రాజెక్ట్ లోన్ బకాయిలో వుంది. రికవరీకి పైవారి ఒత్తిడికంటే లోకల్ పాలిటిక్స్ ప్రమేయం ఎక్కువైంది. నిర్మాణంలో, టైటిల్‌లో, ఫైల్‌లో చాలా లొసుగులు. "మీకెందుకు సార్– పాత విషయాలు?"తో సలహాగా మారి, చేయి తడిపే ప్రయత్నంలోకి జారి, నెల నుంచీ బెదిరింపుల పర్వంలోకి ప్రవేశించింది. వ్యవహారం మొత్తాన్ని హెడ్‌ఆఫీస్‌కి రాతపూర్వకంగా నివేదించేశాడు.

లుకలుకల వారంతా పావులు కదపసాగారు. రికవరీ గురించి పైవారిలో స్తబ్ధత మొదలైంది. ఇక్కడేమో 'పెళ్ళాంపిల్లలు జాగ్రత్త!' వంటి వార్నింగ్‌లు, 'నీ ఆరోగ్యం నువ్ చూసుకో!' వంటి హితోపదేశాలు! వీరిని చూసి ఇతర ప్రాజెక్ట్ లోన్‌ల వారూ నేర్చుకున్నారు. వాటి గురించి పైవారి ఒత్తిడి!

చిత్రమైన విషవలయం...

చిక్కుముడుల దారపు ఉండ!

"ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకోండయ్యా!" అని ఫ్లాట్ వోనర్స్ సంఘాల వారి పళ్ల సందుల్లోంచి వెలువడే పరిహాసపు సలహా! ప్రభుత్వం లక్ష్యం గాలికి పోయిన పేలపిండి!

ఈ ఆలోచనలతోనే సూర్యం నిద్ర తేలిపోయింది.

లేచి వెళ్లి లేతవెలుగులో హాల్లో పచార్లు చేయసాగాడు.

ఇక్కణ్ణుంచీ ఎటూ తన ప్రయాణం? ఇదీ ప్రశ్న!

'తన ఉద్యోగ జీవితం మీద ఇందరి అధికారమా? ఇదీ ఆశ్చర్యం! కుటుంబం గుర్తుకొస్తుంటే ధర్మసందేహం వెన్ను చరుస్తోంది. అసలు ఉద్యోగ జీవితం, కుటుంబ జీవితం... రెండూ వేర్వేరు అరలా? పరస్పరాశ్రితాలు కావా? అక్కడి అశాంతి ఇక్కడ ప్రశాంతి నిస్తుందా?' అందుకనే కదా సుజాతా, పిల్లల మూగవేదనా, భయం!

ఒడ్డున విరిగి పడిపోతున్న కెరటాల మధ్య సూర్యం.

రాత్రి గడుస్తోంది!

●

నిండా నాలుగు రోజులు కాలేదు...

పిడుగు లాంటి వార్త!

అప్పు తీసుకున్న బడుగు ఉద్యోగి ఒకాయన అప్పు తీర్చమనే అధికారుల ఒత్తిడి వలన ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. దినపత్రికల నిండా సంచలన కథనాలు. మాధవరావ్, విశ్వం, సూర్యంల పేర్లు ప్రముఖంగా ప్రచురించారు పత్రికల వాళ్ళు. అటు ఆఫీస్‌లోనూ, ఇటు వీళ్ళ ఇళ్లలోనూ అంతా టెన్షన్, దిగులు, బెంగ, భీతి, భయం.

ఆ సాయంత్రానికి ఆ వ్యక్తి హాస్పిటల్లో తేరుకున్నాడు...

అతనితో ప్రత్యేక ఇంటర్వ్యూలు.

సూర్యమూ, సిబ్బందీ కూడా ధైర్యంగానే హాస్పిటల్‌కి వెళ్లారు. అతన్ని పలకరించాడు. ఆ వ్యక్తి తాలూకూ వాళ్ళెవరో విశ్వంని డబ్బడిగారు- కేస్ లేకుండా చెయ్యటానికి. పోలీసుల హడావుడి!

మాధవరావ్ తన పలుకుబడితో అన్నింటినీ సానుకూలం చేశాడు. చివరికి అసలు వ్యక్తి తన సొంత సమస్యల వలన ఆత్మహత్యా ప్రయత్నం చేశానని స్టేట్‌మెంట్ ఇచ్చాడు! రోజంతా పైనుంచీ ఫోన్లే ఫోన్లు!

ఆ రాత్రి సుజాతా, పిల్లలూ సూర్యం మీద బాగానే మాటల దాడి చేశారు. కళ్ళనీళ్లు పెట్టుకున్నారు.

చివరికి శ్రీలత అన్నది-

"పిరికివాడిలా, వేరే విధంగా బతకలేనివాడిలా, ఈ దరిద్రపు ఉద్యోగంలో వుండటమేమిటి నాన్నా? మీకేంటి- మీరు సి.ఏ. అసలా విషయమే మర్చిపోయినట్టున్నారు మీరు!" అని.

'అవునూ!' అన్నట్లు చూశాయి అక్కడున్న కళ్ళు.

నవ్వేసి ఊరుకున్నాడు సూర్యం.

మర్నాడు-

జరిగిందీ, జరుగుతున్నదీ అంతా రిపోర్ట్ తయారుచేసి పైకి పంపించేశాడు సూర్యం. ఫోన్ చేసి ఎం.డీ.కి చెప్పాడీ వివరాలన్నీ. అన్నీ విని ఆయనన్నాడు- "ఏదిఏమైనా బ్రాంచి ఇన్‌ఛార్జ్‌కి 'ట్యాక్ట్' కావాలండీ. మీ లెవెల్‌లో మీరు చేయాల్సిన పనిని పైవాళ్ళకి తోసేసి మమ్మల్ని ఇరకాటంలోకి నెట్టటం... ఐ డోంట్ లైక్!" అని.

సూర్యంకి మతిపోయింది. కడుపు రగిలిపోయింది. ఆయన ఆంతర్యం అర్థమైంది. మరొకళ్ళని బలిపశువుని చేయటమన్నమాట!

ఆ మర్నాడు- తెలతెలవారుతుండగా సూర్యం అత్తమామలు వైజాగ్ నుంచి దిగారు. సుజాత వాళ్ళకి ఫోన్ చేసి వుంటుందని గ్రహించాడు సూర్యం.

కుశల ప్రశ్నలూ, పరామర్శలూ అయినై. కాఫీలూ అయినై. హాల్లో కూర్చున్నారందరూ. నీళ్లు నిండిన కళ్ళతో దిగులుగా కూర్చునివుంది సుజాత. పిల్లలు మొహాలు వేలాడేసుకుని పరికిస్తున్నారు.

సూర్యం మామగారు అసలు విషయం కదిపాడు-

"ఇంత జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంటే ఎట్టా?" అని, "నేనెవరితోనైనా మాట్లాడనా?" అన్నాడు. ఆయన గవర్నమెంట్ జాబ్ నుంచి రిటైరయిన ఆఫీసరు.

సన్నగా నవ్వాడు సూర్యం.

"నిజంగానే వాళ్ళేమయినా చేయదలిస్తే ఎవరైనా ఎట్టా ఆపగలరు మామయ్యా? వదిలేయండి! ఎటూ మా ఊరొచ్చారు కనుక హాయిగా పిల్లల్తో కాలక్షేపం చేయండి!" అన్నాడు.

తర్వాత ఎవరి పనుల్లోకి వాళ్ళు దిగారు.

రోజులు గడుస్తున్నై.

వారం తర్వాత సుజాత తల్లిదండ్రులు వెళ్లారు.

సాయంత్రం టీ తాగి బాల్కనీలో పచార్లు చేస్తోంది సుజాత.

ఇంటికి ఎదురుగా రోడ్డుకి అవతలి వైపున తురాయి చెట్టుంది. దానిక్రింద ఇద్దరు వ్యక్తులు నిలబడి తనవైపూ, తమ ఇంటివైపూ చేతులు చూపుతూ ఏదో చెప్పుకోవటం గమనించింది. తడబడింది. గుండెల్లో ఏదో భయం లేచింది. అయినా నిబ్బరంతో అక్కడే నిలబడి సూటిగా వారివైపు నిశితంగా చూసింది. ఈమె చూపులకి సమాధానమా... అన్నట్టు వాళ్ళల్లో ఒకడు వేళ్లు మడిచి చూపుడువేలు ఎత్తిచూపుతూ పెదవులు బిగపట్టాడు.

'జాగ్రత్త!' అన్నట్టు భావించుకుంది సుజాత.

గబగబా అడుగులు కదల్చి ఇంట్లోకి వెళ్లిపోయింది.

మనసంతా కలత చెందింది. ఆందోళనతో నిముషాలు స్తంభించినట్లయింది.

గుండెల్ని పట్టుకున్న బరువుతో అలాగే కూర్చుండిపోయింది.

పిల్లలు స్కూలు నుంచి వచ్చారు. సాయంత్రం ఘటనని వాళ్ళకి చెప్పింది... కొంత హాస్యాన్ని మేళవించి. కానీ, నలుగురి మనసుల్లోనూ భయంభయంగానే వుంది.

రాత్రి పొద్దుపోయి ఇల్లు చేరాడు సూర్యం.

కథ మామూలే!

ఎవరిలో భావాలు వాళ్ళవిగా ముభావంగా నిముషాల్ని దొర్లించేస్తున్నారు సుజాతా, సూర్యం.

సాయంత్రం జరిగింది చెప్పింది సుజాత.

పిల్లలూ చేరారు. మాటలు కలిసినై. చర్చ సాగింది. కినుకలు, కోపం, కంఠస్వరాలు పెరగటం... జరిగాయి. సుజాత చాలా నిష్కర్షగా చెప్పేసింది–

"మీరీ ఉద్యోగం నుంచి బయటపడలేకపోతే... మా దారి మేం చూసుకోవాల్సి వస్తుంది" అని.

ఆ తర్వాత ఆమె ఏడుస్తూ కూర్చుంది.

ఆ మాట విని విస్తుపోయాడు సూర్యం. మనస్సు పరిపరివిధాలుగా పోయింది. మాటలు రాలేదు.

అందరినీ ఆందోళనలోనే జాగారం చేయించింది ఆ రాత్రి.

ఇది జరిగిన వారంలోనే నారాయణ వచ్చాడు ఆదివారం నాడు. ఆయన సూర్యం అన్న. విజయవాడలో నివాసం. ఏదో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసి రిటైరయ్యాడు.

రాత్రి తీరిగ్గా మొదలైంది సంభాషణ–

"నీ ఉద్యోగం, అవస్థలు అన్నీ తెలిసినయ్‌రా సూర్యం! కొన్ని కర్ణాకర్ణిగా, కొన్ని మీ మామగారి ద్వారా, ఇప్పుడేమో సుజాతా, పిల్లలూ చెప్పారు. నిజానికి వాళ్ళే నన్నోసారి

వచ్చి నీతో మాట్లాడమన్నారు. అమ్మా, నాన్నా పోయినతర్వాత ఇంత గౌరవం దక్కటమూ సంతోషమే."

బెదురుచూపులతో వినసాగాడు సూర్యం.

సంఘటనలూ, సంగతులూ, వివరాలూ చర్వితచర్వణం అయ్యాయి.

అప్పుడన్నాడాయన– "ఉద్యోగం జీవితంలో చాలా ముఖ్యమైన భాగమే. అందరం ఒప్పుకొనే సంగతే. కానీ, ఎవరికీ కూడా ఉద్యోగమే జీవితం కాకూడదు. ఈ అవస్థలన్నీ కడకు ఏ ఫలితాన్ని ఆశించి భరించేవి? ప్రశాంతంగా నోటికి నాలుగు ముద్దల్ని అందించాలనే కదా! మరి ఆ ప్రశాంతీ, తిండీ రెండూ కరువౌతున్నప్పుడు ఈ దేకుడంతా దేనికి? నువ్వెన్ని త్యాగాలు చేసినా నెత్తిన కిరీటం పెట్టేవాళ్ళెవరున్నారు? బాగా చేశావని చప్పట్లు కొట్టేవాడే కించిత్తు లోపానికి క్షణాల్లో పాతాళానికి తోసేస్తాడు."

చెప్పటం ఆపి, క్షణంసేపు ఆగాడు నారాయణ. ఆయన కెందుకో కంఠం రుద్ధమయింది. దుఃఖం కలిగింది.

"నీకూ తెలుసుగా... నా పెద్దకొడుకు– అదే మన హరి. బతుకంతా నేను వాణ్ణీ, వాడి బాగోగుల్నీ పట్టించుకోలేదని దేశాలు పట్టి పోయాడా! ముప్ఫయ్ ఏళ్లు, అసలు వాడి వేరెబౌట్స్ తెలీవు కదా!" కొంచెం ఆయాసపడ్డాడు.

వాతావరణం గంభీరంగా మారింది.

సుజాత లేచివెళ్లి గ్లాసుతో నీళ్లు తెచ్చిచ్చింది. తాగాడు. మళ్లీ చెప్పసాగాడు–

"నువ్వెన్నైనా ఆటుపోట్లని తట్టుకుని నిలబడగలిగినవాడివే అయినా, ఆ ఘాతాలన్నిటినీ పెళ్ళాం పిల్లలెందుకు తట్టుకోవాలి? ఆలోచించు. ప్రాణాన్ని కష్టపెట్టుకోవటం వేరు, ప్రాణాల్ని హింసించటం వేరు. మొదటిదానికి మనం కర్తలం. రెండవ పని చేయటానికి మనకున్న అధికారమేమిటి? సమాజోద్ధరణ, విధి నిర్వహణ వంటివన్నీ బోలుమాటలే."

అంతకుమించి ఏమీ మాట్లాడలేదు. నిముషాలు ప్రవహిస్తూనే ఉన్నై.

తెల్లవారింది...

నారాయణ వెళ్లిపోయాడు.

•

అన్న చెప్పిపోయిన మాటల్ని గురించి ఆలోచిస్తూనే వున్నాడు సూర్యం.

ఇంతలోనే ఒకనాడు–

'అప్పు వ్యవహార కారణంగా ఏదో హౌజింగ్ కంపెనీలో రికవరీ మేనేజర్ అనుమానాస్పద స్థితిలో మరణం' అంటూ దినపత్రికలో సంచలన వార్త వచ్చింది.

అది హత్యే అని ఊరూ నాడూ కోడై కూసింది.

అత్తమామల నుంచి ఫోన్ సూర్యంకి. అన్న నారాయణ నుంచీ హెచ్చరిక లాంటి హితవు అందింది.

హ్యామ్లెట్ పరిస్థితిలో పడ్డాడు సూర్యం.

ధైర్యం చేసి ఒక అడుగు వేరే మార్గంలో వేయటమా? ఏ వృత్తిలో రిస్క్ ఆ వృత్తిలో లేదా? ఏ ఉద్యోగం రిస్క్ ఆ ఉద్యోగానికి లేదా? ద్వైదీభావంలో కొట్టుకులాడింది మనసు. పిరికితనంతో పరిస్థితులకి తలవొగ్గటమేనా? తల కాచుకోవటం పిరికితనమా?

ఉన్నట్టుండి ఈరోజు విశ్వం ఆఫీస్‌కి రాలేదు. వాళ్ళ తమ్ముడి చేత రిజిగ్నేషన్ లెటర్ పంపాడు. దానితో పాటు సూర్యం పేర మరో ఉత్తరం.

సూర్యం షాక్ తిన్నాడు. ఉత్తరం చదివాడు–

"సూర్యం సార్! దేశంలోని చాలా సంస్థల్లో ఇలాంటి చాలా ఉద్యోగాల్లో ఎంతోమంది ఇదే జాబ్ చేస్తూ ఉండొచ్చు. కానీ నాలాంటి వాళ్ళకి తగిన పని కాదిది. పైన కొండచిలువ, కింద ఏరూ, మధ్య కొమ్మమీద నిలబడి చింతచిగురు కోయటం! ఎంతసేపు జరిగే వ్యవహారం. నాకు సలహాలు చెప్పేందుకు ప్రయత్నించకండి. నేను చెన్నై వెళ్తున్నాను. థాంక్స్!" –ఇదీ సారాంశం.

●

ఇప్పుడు 'సూర్యం అండ్ కో' ఫర్మ్ చాలా బిజీగా వుంది.

సూర్యం ఏదో విషయం చర్చిస్తూ అంటున్నాడు– "టు బీ మోర్ లాయల్ దేన్ కింగ్' మన ఆరోగ్యానికి మంచిది కాదు. కొంచెం ఆలస్యంగా జ్ఞానోదయమైంది. థాంక్స్ టు మై బ్రదర్ అండ్ విశ్వం."

ఎదురుగా కూర్చున్న వాళ్ళల్లో ఎవరో అన్నారు– "ఇప్పుడు మీకు లోకరీతీ, రివాజూ అర్థమైంది!"

ఖేదమూ, మోదమూ కాని వేదాంతి నవ్వు నవ్వాడు సూర్యం!

●

'రచన' మాసపత్రిక ... అక్టోబర్' 2009 సంచికలో ప్రచురితమైన కథ